ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలానికి చెందిన పాండ్యాల రాజాగౌడ్, నవ్య బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేస్–2 లో ఉంటున్నారు. అయితే తాము అద్దెకు ఉంటున్న గోడలకు కరెంట్ సప్లై అవుతుందని ఇంటి యజమాని ద్వారా తెలుసుకున్న రాజాగౌడ్ విద్యుత్ సప్లైను చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల నష్టపరిహారం అందేలా కృషి చేశారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మృతుడి భార్య నవ్యకు ఎమ్మెల్యే చెక్కును అందజేశారు. ప్రభుత్వ పరంగా మరింత సహాయం అందేలా కృషిచేస్తానని హామీనిచ్చారు.

హెల్మెట్‌తో ద్విచక్రవాహనదారులకు ప్రాణరక్షణ



అవగాహన కల్పిస్తున్న బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం



హెల్మెట్లు అందజేస్తున్న వినోద్‌జాదవ్

రంగారెడ్డినగర్: హెల్మెట్‌తో ప్రాణరక్షణ ఉంటుందని బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ వినోద్ జాదవ్ అన్నారు. రంగారెడ్డినగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాల ఆధ్వర్యంలో ఐసీఐసీఐ లంబర్డ్, 'ట్రాక్స్–ఎస్' సొసైటీ ఎన్జీవో సంస్థల సౌజన్యంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిరస్త్రానాలు సంస్థ ప్రతినిధి ఆరాధన జైన్‌తో కలిసి 500 హెల్మెట్లను అందజేశారు. అనంతరం వినోద్ జాదవ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో చిన్నారులు, పెద్దలు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. రాంగ్‌రూట్, ట్రిబుల్ రైడింగ్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ట్రాక్స్ 'ఎస్' సొసైటీ ఎన్జీవో సంస్థ ప్రతినిధి ఆరాధన జైన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల భద్రతకు తమ సంస్థ ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఉచితంగా హెల్మెట్లు అందించామన్నారు. కార్యక్రమంలో బ్రైట్ యూరో కిడ్స్ ఇన్‌చార్జి వికాస్ జాదవ్, పాఠశాల ఇన్‌చార్జి ఆయేషాబేగం, ఉపాధ్యాయులు ప్రభు, అంబిక, శ్రీదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

నిజాంపేట్: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి పీఆర్సీని ప్రకటించాలి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. దోమలగూడలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు జయసింహారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాయిస్ ఆఫ్ తెలంగాణ సంపాదకుడు మాణిక్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి మేడ్చల్ జిల్లాకు ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేసి వారిని సొంత జిల్లాలకు పంపాలన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలని, జూన్‌లో జరిగిన ఉపాధ్యాయుల వెబ్ కౌన్సిలింగ్‌లో తప్పులు దొర్లాయని, స్పౌజ్ విషయంలో తప్పుడు బదిలీ పెట్టుకున్న ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం కమిటీ సభ్యులకు సంఘం నిబంధనలు, నిర్మాణం తదితర విషయాలను వివరించారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాకేశ్, కోశాధికారి ఉపేందర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పనులు ప్రారంభించిన హన్మంతరెడ్డిని సత్కరించిన మిథిలానగర్ వాసులు

సుభాష్‌నగర్: మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని నియోజకవర్గ కాంగ్రెస్ నేత కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధి మిథిలానగర్‌లో సీసీ రోడ్డు ధ్వంసమై ఇబ్బందులు పడుతున్నామని బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును సంప్రదించి స్పెషల్ నిధులు మంజూరు చేయించి ఆదివారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను బస్తీవాసులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, వెంకటేశ్, శ్రీధర్, ఎండీ గఫార్, అజయ్, ఆర్కే టౌన్‌షిప్ కాలనీవాసులు సంతోష్, వినయ్ కుమార్, ఉదయ్ ఉల్జీ ఉదయ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ దసరా మేళాకు తరలిన నాయకులు



శంకరయ్యను సత్కరిస్తున్న సంఘం నాయకులు

చింతల్: ఎల్బీనగర్‌లో 22వ పద్మశాలీ దసరా మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య ఆధ్వర్యంలో పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి సేలందిస్తున్న పలువురిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కంది శ్రీరాములు, వడిచెర్ల మారుతి, లక్ష్మీనర్సయ్య, కామిని శ్రీనివాస్, మేకల మల్లేశ్, నారా వెంకటేశ్, దేవులపల్లి యాదగిరి, దయ పెంటయ్య, వంగర విఠల్, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వైవీఎస్ సుబ్బారెడికి శుభాకాంక్షలు తెలుపుతున్న గోపాల్

కుత్బుల్లాపూర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు, గుంటూరు జిల్లాల రీజినల్ కో.ఆర్డినేటర్‌గా నియమితులైన వైవీఎస్.సుబ్బారెడ్డిని ఆయన నివాసంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత సాతాల గోపాల్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు..

కుత్బుల్లాపూర్: తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలిగా నియమితులైన కందాడి జ్యోత్స్నారెడ్డి షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను పీసీసీ కార్మిక విభాగం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సుదర్శన్‌రెడ్డిని శ్రీశైలంగౌడ్ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



జ్యోత్స్నారెడ్డిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

పార్కు నిర్వహణ గాలికి..!

అధ్వానంగా ఏపీహెచ్‌బీ కాలనీ పార్కు–2



ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కు–2 నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో అధ్వాన్నంగా తయారైంది. పారిశుధ్య నిర్వహణ లోపంతో పాటు గోనె సంచులు గుట్టలుగా వేయడంతో అవి కంపు కొడుతున్నాయి. అదేవిధంగా పార్కులోని నడకదారిలో టైల్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షాలు కురిసినప్పుడల్లా బురదమయంగా మారి నడిచేందుకు కూడా వీల్లేకుండా పోతోందని వాకర్స్ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కులో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. –రంగారెడ్డినగర్

నేటి నుంచి ట్రాన్స్‌జెండర్లకు ఉచిత శిక్షణ తరగతులు

సుభాష్‌నగర్: హైదరాబాద్ ఆర్చిడయోసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ సౌజన్యంతో క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు నేటి నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం ఎన్టీఆర్ భవన్‌లో కంప్యూటర్, పేపర్ ప్లేట్ల తయారీపై శిక్షణను ఉదయం 11 గంటలకు మేడ్చల్ జిల్లా డీబ్ల్యూఓ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. నియోజకవర్గ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు 7729869207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

నిజాంపేట్: వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి ఎస్సీకాలనీకి చెందిన హెచ్ ఎండబ్ల్యూఎస్‌లో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్న అశోక్ కుటుంబ కలహాలతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణ కాలేజీలో విద్యార్థిని ..

జహీరాబాద్‌కు చెందిన సిరిపురం అనూష (17) బాచుపల్లిలోని నారాయణ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం కాలేజీలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై దాడి.. ఒకరిపై కేసు

దుండిగల్: తన కుమార్తెపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచాడని తల్లి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. భౌరంపేట ప్రాంతానికి చెందిన భార్యభర్తలు నివసిస్తున్నారు. వీరికి 6 , 4 ఏళ్ల ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కాగా వీరు అద్దెకు ఉంటున్న మూడో అంతస్తులో రాంబాబు అనే వ్యక్తి తన కుటుంబంతో ఉంటున్నాడు. రాంబాబు భార్య డెలివరీ కోసం తన పుట్టింటికీ వెళ్లడంతో అతని స్నేహితుడు యోగి తరుచూ ఇంటికి వస్తుండే వాడు. ఈక్రమంలో అప్పుడప్పుడు బాధిత కుటుంబ రాంబాబు ఇంటికి వెళ్లేవారు. కాగా ఈ నెల 12న యోగి ఆడుకుందాం.. అని చెప్పి తన పెద్ద కుమార్తెను కొట్టి, మంచంపై పడేసి దాడి చేశాడని, స్నానం చేయించాడని, తనను కూడా అదేవిధంగా చేశాడని చిన్న కుమార్తె సైతం వివరించింది. దీంతో బాధిత తల్లి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులుయోగిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా కుమారుడి పెళ్లికి రండి



మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కాసాని

నిజాంపేట్: మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ కుటుంబసమేతంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడు సాయి వివాహానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన ఆర్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కేటింగ్ విద్యార్థులు

నిజాంపేట్: స్పోర్ట్స్ ఫర్ ఆల్ ఎస్ఎఫ్ఏ రాష్ట్రస్థాయి కాంపిటీషన్‌లో నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన ఆర్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కేటింగ్ విద్యార్థులు ప్రతిభ చూపారు. భౌరంపేట్‌లోని సింథటిక్ స్కేటింగ్ ట్రాక్‌పై జరిగిన పోటీల్లో విద్యార్థులు ఆద్విక్, తనయ్ గోల్డ్ మెడల్ సాధించగా, చెర్విక్ మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు. అదేవిధంగా మెడల్విదిక్, తారక్, సిల్వర్ మెడల్స్, యశ్వంత్, ఆహనా (2), హాస్విత్, మోక్ష, సుదీక్ష, రిషి(2), వేద బ్రౌంజ్ మెడల్స్ సాధించారు.

ఘనంగా గ్యార్మీ ఉత్సవాలు



ఉత్సవాల్లో కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి ఇందిరమ్మకాలనీలో ముస్లింల ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్మీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత విద్వేషాలు లేకుండా అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో నరేశ్ యాదవ్, మైనార్టీ సెల్ నాయకుడు ఎస్‌కే సద్దాం తదితరులు పాల్గొన్నారు.

రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్

చందానగర్ : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చందానగర్ విద్యా వాణి హైస్కూల్ కరెస్పాండెంట్ కె.అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చందానగర్‌లో శేరిలింగంపల్లి ప్రైవేట్ స్కూల్ కరెస్పాండెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా మండల అధ్యక్షులుగా, జిల్లా ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవులు సమర్థవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు.

ఉన్మాదులు ఎక్కడున్నా వదిలిపెట్టం: ఎంపీ ఈటల



మేడ్చల్‌రూరల్: ప్రధాని మోదీ టెర్రరిజం, ఉన్మాదుల మీద ఉక్కుపాదం పెట్టారని ఈ ఉన్మాదులు ఎక్కడ ఉన్నా వదిలిపెట్టమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ కేనోపిలో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్, మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ 2 నెలల వ్యవధిలో ఆరు ఆలయాలు ధ్వంసం అయినా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకోవాల్సి వస్తుందన్నారు. హైదరాబాద్ నగరం ఇప్పుడిప్పుడే బాంబు పేలుళ్ల నుంచి తేరుకుంటుందన్నారు. చెరువుల చుట్టు ఇళ్లు కట్టుకున్న వాళ్లలో 99 శాతం మందివి అక్రమాలు కావని, పట్టాభూముల్లో ప్రభుత్వ అనుమతులతో కట్టుకున్నవని తెలిపారు. హైడ్రా పేరుతో దొంగల్లాగ ఆ ఆశల సౌదాలను కూలగొట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో విస్తరింపజేయాలని ఇప్పటికే పార్లమెంట్‌లో మాట్లాడినట్లు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, సరస్వతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ పోలీసుల రక్తదానం

మేడ్చల్‌రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిక్షణ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో 250 మంది ట్రైనీ పోలీసు లు రక్తదానం చేశారు. అమర పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.